సాక్షి విజయనగరం

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



టెస్టింగ్ సెంటర్ ఉందిగా.. నకిలీల బెడద ఉండదిక

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటవుతున్నాయి.

- 8లో



కనులకు అందం.. కవలల బంధం

అశ్వినీ దేవతలు, లవకుశలు, నకుల, సహదేవులు కవలలని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి. ఒకే రూపంతో ఉండే కవలలంటే ఇష్టపడని హృదయం ఉండదు.

- 8లో

అక్షర ప్రేమ



గుర్ల: మాతృభాషా దినోత్సవం సందర్భంగా గుర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 111 మంది తెలుగు కవులు, రచయితుల చిత్రపటాలను మంగళవారం ప్రదర్శించారు. అ,ఆలు ఆకారంలో ఏర్పడి అక్షర ప్రేమ చూపారు. విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలని హెచ్‌ఎం ఉమామహేష్, తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణ సూచించారు.

న్యూస్‌రీల్

పుణ్యగిరి ఆదాయం రూ.16లక్షలు



పుణ్యగిరిలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

శృంగవరపుకోట: పుణ్యగిరి ఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వై.వి.రమణి, దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.5,77,478లు, దర్శనం టిక్కెట్ల అమ్మకంతో రూ.8,20,065లు, ప్రసాదాల విక్రయాల వల్ల రూ.1,93,480లు ఆదాయం లభించింది. విరాళాల రూపంలో వచ్చిన ఆదాయం తగ్గింది. గతేడాది రూ.56,979లు రాగా, ఈ ఏడాది రూ. 21,032లు మాత్రమే వచ్చింది. గతేడాది మహాశివరాత్రి జాతర సమయంలో రూ.12,43,378లు రాగా, ఈ ఏడాది రూ.16,12,055లు సమకూరినట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. భక్తులు హుండీలలో వేసిన వెండి, రాగి, బంగారం తూకం వేయాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ వై.వి.రమణి చెప్పారు. కార్యక్రమంలో ఈఓ కె.నాగేంద్ర, బోర్డు డైరెక్టర్లు, దేవదాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అందరికీ సామాజిక న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

విజయనగరం లీగల్: అందరికీ సామాజిక న్యాయం అందాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.హెచ్.వి.లక్ష్మీకుమారి అన్నారు. విజయనగరంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు ఉచిత న్యాయం అందించడమే న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమన్నారు. మెప్మాకు చెందిన కె.సన్యాసిరావు వివిధ వర్గాల ప్రజలకు అందించే సేవలను వివరించారు. బర్త్, డెత్, వివాహ రిజిస్ట్రేషన్ సేవలను శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిద్దాం



ఎమ్మెల్సీ అభ్యర్థి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రేగిడి: వైఎస్సార్ సీపీ తరపున బరిలో నిలిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్‌లు పిలుపునిచ్చారు. రేగిడిలో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచార వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేదిశగా సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పించారని, ఈ విషయాన్ని గుర్తించి గ్రాడ్యేట్లు సుధాకర్‌కు మద్దతుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు పాల్గొన్నారు.

మిగులు ధాన్యం కొనుగోలు



రేగుబిల్లి ఆర్‌బీకేలో కియోస్కోను పరిశీలిస్తున్న తారకరామారావు

గంట్యాడ: రైతు భరోసా కేంద్రాల పరిధిలో మిగిలిఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయఅధికారి తారకరామారావు వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కొండతామరపల్లి, రేగుబిల్లి, వసంత, పెంట శ్రీరాంపురం ఆర్‌బీకేలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదుపై ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు రికార్డులు పరిశీలించి పలు సూచనలిచ్చారు. కట్టెజనుము సాగుతో భూ సారం పెరుగుతుందని, పచ్చిరొట్ట ఎరువుగా సాగుచేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏడీ నాగభూషణం, ఏఓ శ్యామ్‌కుమార్ ఉన్నారు.

అదిగదిగో... ప్రభుత్వ వైద్య కళాశాల

- 2023-24 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభానికి పచ్చజెండా
- 150 ఎంబీబీఎస్ సీట్లలో ప్రవేశాలకు ఎన్ఎంసీ అనుమతి
- తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు
- 78 మంది బోధన, బోధనేతర సిబ్బంది నియామకం
- తాత్కాలిక నిర్వహణకు రూ.8.50 కోట్ల వ్యయం
- త్వరలోనే అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

వైద్యకళాశాల ప్రారంభించేందుకు ఆధునీకరించిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రభుత్వ వైద్య కళాశాల... ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే అది సాకారం కాబోతోంది. వైద్య కళాశాల నిర్వహణకు అవసరమైన అనుమతులను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. రాష్ట్రంలో 16 కొత్త వైద్య కళాశాలలు మంజూరు కాగా ఎన్ఎంసీ అనుమతి పొందిన తొలి వైద్య కళాశాల మనదే కావడం గమనార్హం. 150 ఎంబీబీఎస్ సీట్లు కూడా మంజూరయ్యాయి. 2023-24 విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి.

వాస్తవానికి అత్యవసర వైద్య సేవల కోసం జిల్లా ప్రజలు వ్యయప్రయాసలకోర్చి వైజాగ్ పోవడం తప్ప మరో మార్గం లేదు. అవి శాశ్వతంగా తీరాలంటే విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల అవసరమని దశాబ్దాలుగా జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయనగరానికి ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసింది. దీని నిర్వహణకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ఏడుగురు ప్రొఫెసర్లు, 22 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 36 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 13 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ఇప్పటికే విధుల్లో చేరారు. ల్యాబ్ టెక్నీషియన్, ప్లంబర్, లైబ్రరీ అసిస్టెంట్ కేడర్లకు సంబంధించి 18 మంది కాంట్రాక్టు ఉద్యోగులను, ల్యాబ్ అటెండెంట్, మార్చురీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండెంట్ కేడర్లకు సంబంధించి 20 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది.



గాజులరేగ వద్ద నిర్మాణం కానున్న విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల నమూనా



నిర్మాణంలో ఉన్న వైద్యకళాశాల భవనం

తొలి సంవత్సరం తరగతులకు...

తొలి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు మొదటి ఏడాది ఎనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ తరగతులు బోధించే ప్రొఫెసర్లకు గదులు అవసరం. వీటి నిర్మాణాన్ని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు శరవేగంగా నిర్మిస్తున్నారు. ఏప్రిల్ నెల నాటికి వీటిని సిద్ధం చేయనున్నారు. మెడికల్ కాలేజీ తాత్కాలిక నిర్వహణ కోసం ప్రభుత్వం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఆధునీకీకరించింది. దీనికోసం రూ.8.50 కోట్లు నిధులు వెచ్చించింది. కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో వార్డులు, ఐసీయూలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. సర్వజన ఆస్పత్రిలో 30 పడకల ఇంటెన్సివ్‌కేర్ యూనిట్, 30 పడకల సర్జికల్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ నిర్మాణ పనులు చేపట్టారు. అదేవిధంగా స్త్రీల మెడికల్ వార్డు, ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్, ఉపన్యాస గ్యాలరీ ఇప్పటికే సిద్ధం చేశారు. మరుగుదొడ్లు అన్నింటిని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ఎంఆర్ఐ, సిటి స్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్ అందుబాటులోకి వచ్చాయి.

మూడు వారాల్లోనే అనుమతులు...

ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరుకు అవసరమైన వసతులు ఉన్నాయా, లేదా అని పరిశీలించడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బృందం ఈనెల 3వ తేదీన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని, గాజులరేగ వద్ద దాదాపు రూ.500 కోట్లతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. వారు పరిశీలించి వెళ్లిన మూడు వారాల్లోపే అనుమతులు మంజూరయ్యాయి.

జగన్‌మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారు...



సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏ మాట చెప్పినా అది కచ్చితంగా నిలబెట్టుకుంటున్నారు. పాదయాత్రలో ఆయన విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సాకారం చేశారు. 150 ఎంబీబీఎస్ సీట్లతో 2023-24 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల తరపున ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

ప్రాథమిక అనుమతి వచ్చింది...



విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి ప్రాథమిక అనుమతి వచ్చింది. ఫైనల్ అప్రూవల్ కోసం అండర్ టేకింగ్ అడిగారు. నివేదిక అందజేసేందుకు వారం రోజులు గడువు ఇచ్చారు. అది ఇచ్చిన వెంటనే ఫైనల్ అప్రూవల్ వచ్చేస్తుంది.

– డాక్టర్ కె.పద్మలీల, ప్రిన్సిపాల్, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల

అనుమతి రావడం శుభపరిణామం..



ఎన్ఎంసీ నుంచి విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణకు అనుమతి రావడం శుభపరిణామం. కళాశాల ప్రారంభమైతే జిల్లా ప్రజలకు నాణ్యమైన ఆధునిక వైద్యసేవలు అందుతాయి. అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. 2023-24 విద్యా సంవత్సరం నుంచే ఎంబీబీఎస్ ప్రవేశాలు జరగనున్నాయి.

– ఎ.సూర్యకుమారి, కలెక్టర్

కరుణించు తల్లీ..

- పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- ఐదోజాతరకు తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన క్యూ కాంప్లెక్స్



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం జరిగిన ఐదో జాతరలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. వేలాది మంది భక్తుల రాకతో చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌లు కిక్కిరిసిపోయాయి. ఉదయం 10 గంటల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని, వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకుని, ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. గోముఖీనదీ తీరంలోని తోటల్లో వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. సాలూరు సీఐ ధనుంజయరావు, మక్కువ ఎస్ఐ జి.పైడిరాజు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ చదురుగుడి క్యూలైన్‌నువీక్షించి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రగతి పథంలో కనకమహాలక్ష్మి ఆలయం



అమ్మవారి ఆస్తులు వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్

- అమ్మవారి ఖాతాలో రూ.45,10,222 నిల్వలు
- ఫిక్సిడ్ డిపాజిట్ల రూపంలో రూ.35,38,632
- 2.125 కేజీలు బంగారం, 32 కేజీల వెండి
- విలేకరుల సమావేశంలో స్పష్టం దేవస్థానం కమిటీ

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆదాయం ఏటా పెరుగుతోందని దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్‌లు స్పష్టం చేశారు. ఆలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ల సహకారంతో అమ్మవారి దేవస్థానం అభివృద్ధి చెందుతోందన్నారు. వారి సహకారంతో ఈ నెల 26, 27, 28 తేదీల్లో అమ్మవారి 25వ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి బ్యాంకు ఖాతాలో రూ.45,10,222 నిధులు నిల్వ ఉన్నట్టు వెల్లడించారు. ఫిక్సిడ్ డిపాజిట్ల రూపంలో రూ.35,38,632 ఉందన్నారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన 2.125 కేజీల బంగారం, 32 కేజీల వెండి బ్యాంకు లాకర్‌లో ఉందని స్పష్టంచేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కేటాయించిన నిధులతో రికార్డుల నిర్వహణ గది, వంటగది నిర్మించామన్నారు. జెడ్పీ చైర్మన్ రూ.30 లక్షల సొంత నిధులతో మూడురోడ్ల కూడలిలో అమ్మవారి ఆర్చ్‌ను నిర్మించినట్టు వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల నీడ కోసం రూ.5 లక్షల ఆలయ నిధులతో షెడ్లు వేయించామని చెప్పారు. సీజీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో అమ్మవారి ఆలయ అర్చకుల క్వార్టర్స్‌ను, రూ.4.98 లక్షల జెడ్పీ నిధులతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు మరుగుదొడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఈఓ జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు వంకల కృష్ణ, అద్దాల రవి, కంది శ్రీరాములు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.2,22,256 లక్షలు



అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. గతేడాది డిసెంబర్ 19 నుంచి 2023 ఫిబ్రవరి 21 వరకు హుండీల నుంచి రూ.2,22,256 లక్షల ఆదాయం లభించినట్లు ఇన్‌స్పెక్టర్ పి.వి.లక్ష్మి తెలిపారు.

రూ.400 కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు

- నిరంతరం సరఫరాకు కృషి
- విద్యుత్‌శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు



బొబ్బిలి రూరల్:

విజయనగరం ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్ల వ్యయంతో రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్) కింద మెరుగైన విద్యుత్ సరఫరా పనులు చేపట్టామని విద్యుత్‌శాఖ ఎస్ఈ పి.నాగేశ్వరరావు తెలిపారు. విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయంలో సిబ్బందితో సాంకేతికత, సరఫరా, గ్రీవెన్స్ తదితర అంశాలపై మంగళవారం సమీక్షించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఒక్కొక్కటి రూ.2కోట్ల వ్యయంతో 21 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. రెండువేలు డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 14 ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ.42 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. వ్యవసాయమోటార్లకు 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. జగనన్న లేఅవుట్లు జిల్లాలో 907 ఉండగా, వీటిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన వారికి విద్యుత్ మీటర్లు అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది వ్యవసాయ మీటర్లు 2,550 మందికి అందజేశామని, మరో 430 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు 200యూనిట్ల వరకు ఉచితమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ కనెక్షన్లు ఉమ్మడి జిల్లాలో 48,678 ఉన్నాయన్నారు. సోలార్‌ఎనర్జీ వినియోగం పెరుగుతోందని, భావితరాలు దానిపైనే ఆధారపడి విద్యుత్ అవసరాలు తీర్చుకుంటారన్నారు. ఆయన వెంట డీఈఈ పూడిహరి ఉన్నారు.

చెరకు రైతులకు రూ.80.7కోట్ల చెల్లింపు



- మార్చి నెలాఖరుకు క్రషింగ్ పూర్తి
- డిప్యూటీ కేన్ కమిషనర్ జీవీవీ సత్యనారాయణ

బొబ్బిలి: భీమసింగి, సంకిలి సుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని చెరకు రైతులకు రూ.80.7కోట్ల మేర బిల్లులు చెల్లించినట్టు డిప్యూటీ కేన్ కమిషనర్ జీవీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక సీడీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సంకిలి చక్కెర కర్మాగారంలో ఇప్పటివరకు 3,27,708 మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ జరిగిందన్నారు. మార్చి నెలాఖరునాటికి క్రషింగ్ పూర్తికావచ్చన్నారు. ఈ ఏడాది అంచనాలకంటే తక్కువ క్రషింగ్ జరిగిందన్నారు. రైతులకు మరో రూ.11కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ ఏడాది రికవరీ శాతం 10.05గా ఉందని, గత ఏడాది రికవరీ శాతం 9.48గా నమోదైందని పేర్కొన్నారు.

ఆర్‌జేడీగా ఉద్యోగోన్నతి



పి.వి.కృష్ణాజీ

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వి.కృష్ణాజీకు జోన్-2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యాకమిషనర్ డా. పోల భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల సీనియర్ అధ్యాపకునికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించాలనిఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రశ్నించేతత్వంతోనే విజ్ఞానం

- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్ సూర్యకుమారి
- వర్తమాన, భవిష్యత్ అవసరాలను తీర్చేలా ప్రాజెక్టుల ప్రదర్శన



ప్రాజెక్టు పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రశ్నించేతత్వం అలవర్చుకుంటే కొత్త విషయాలను నేర్చుకోగలరని, విజ్ఞానం పెంపొందుతుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల అభిరుచిని గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రశ్నించే విద్యార్థుల పట్ల అసహనం ప్రదర్శించకుండా సమాధానాలు చెప్పాలని హితవుపలికారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయనగరం సెయింట్‌ఆన్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించారు. పనితీరును తెలుసుకున్నారు. నిజజీవితంలో ఏవిధంగా ఉపయోగపడతాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులనుద్దేశించి ఆమె మాట్లాడారు. భావితరాలకు ఉపయోగపడే ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని సూచించారు. వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టులను రూపొందించాలన్నారు. వర్తమాన, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేకవర్క్‌షాపులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపికైన 135 ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను అభినందించారు. సృజనాత్మకతకు మరింత పదును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ డీఈఓలు కె.వాసుదేవరావు, తిరుపతినాయుడు, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజు, సెయింట్‌ఆన్స్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ లూర్దుమేరీ, సైన్సు కో ఆర్డినేటర్ కృష్ణారావు, న్యాయనిర్ణేతలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయ పోలీస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయశ్రీ


కొటాన జయశ్రీ

విజయనగరం క్రైమ్: సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా కొటాన జయశ్రీ, ఉపాధ్యక్షురాలిగా ఎం.కల్పనా మయూరి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అడహక్ కమిటీ అధ్యక్షురాలు ఎస్.మహాలక్ష్మి (తిరుపతి), ప్రధానకార్యదర్శి డి.మధులత (గుంటూరు)లు తమను ఎంపిక చేశారని పేర్కొన్నారు. మహిళా పోలీసుల సమస్యల పరిష్కారం, సంక్షేమం ధ్యేయంగా ఏపీ మహిళా వెల్ఫేర్ అసిసియేషన్‌ను స్థాపించామన్నారు. మహిళా సంరక్షణ పోలీసుల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషిచేస్తామని చెప్పారు. జిల్లా నుంచి రాష్ట్ర వర్కింగ్ కమిటీలోజయశ్రీ, ఎం.కల్పనా మయూరి ఎంపికవ్వడంతో జిల్లాలోని మహిళా సంరక్షణ పోలీసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్పీపై దర్యాప్తు ప్రారంభం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన మెప్మా ఆర్పీపై జిల్లా అధికారులు దర్యాప్తు ప్రారంభించారని మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం మంగళవారం తెలిపారు. మెప్మా పీడీ ఆదేశాల మేరకు జిల్లా మెప్మా కార్యాలయం నుంచి కేవీస్ శ్రీనివాసరావు, బి.కిశోర్‌బాబు, ఎం.కృష్ణలను దర్యాప్తు బృందంగా ఏర్పాటయ్యారన్నారు. వారు అవకతవకలకు గురైన గ్రూపు సభ్యుల వద్ద మున్సిపాల్టీలోని మెప్మా కార్యాలయంలో పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ప్రతి గ్రూపు సభ్యురాలు లావాదేవీలకు సంబంధించి పుస్తకాలు తీసుకురావాలని, రోజుకు రెండు గ్రూపులను తనిఖీ చేయనున్నామన్నారు. ఇదిలా ఉండగా అక్కడికి హాజరైన సభ్యులు తమ గ్రూపుల్లో అవకతవకలు జరిగాయని అధికారులకు వివరించారు. గ్రూపుసభ్యుల వద్ద రికార్డులు లేకపోవడంతో బ్యాంకు నుంచి స్టేట్‌మెంట్‌లు తీసుకురావాలని దర్యాప్తు అధికారులు తెలిపారు. తనిఖీ చేయనున్న గ్రూపులకు సంబంధించి ముందుగానే సమాచారం ఇస్తామని తెలిపారు. శివజ్యోతి గ్రూప్‌కు సంబంధించి అవకతవకలకు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బ్యాంకు లింకేజీలకు సంబంధించి ఆర్పీ ఇచ్చిన ఫొటోలు, సంతకాలకు పొంతన లేకపోవడంతో ఫోర్జరీగా నిర్ధారించారు. అనంతరం ఆర్పీ శారదను పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక తయారుచేశామని తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న లక్ష్మి

పార్వతీపురం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ మేరకు పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం ఇందిరానగర్‌కు చెందిన కె. లక్ష్మి కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు, రెండవ కుమార్తె పెందుర్తిలో నర్స్ ట్రైనింగ్ చేస్తోంది. చదువుకోసం డబ్బులు పంపించాలని కూతురు కోరడంతో డబ్బులు లేక మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తికి గాయాలు

పార్వతీపురం: బొబ్బిలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన ఎస్.సత్యనారాయణ విద్యుత్ షాక్ తగిలి గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఇంటి సీలింగ్ వర్క్ నిమిత్తం పార్వతీపురంలోని వైకేఎం కాలనీలో ఆయన పనిచేస్తున్న సమయంలో మేడమీదకు మెటీరియల్ తీసుకువెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి కిందపడిపోయాడు. వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెస్టింగ్ సెంటర్ ఉందిగా..
నకిలీల బెడద ఉండదిక

- విత్తనాలు, ఎరువుల పరీక్షలతో రైతులకు సర్కారు అండ
- నియోజకవర్గానికి ఒక వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్
- అన్నదాతలకు ఉపయోగకరం


సాలూరులో నిర్మాణమవుతున్న వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

సాలూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరో నూతన కార్యక్రమానికి అడుగులు పడ్డాయి. నకిలీ విత్తనాలు, ఎరువులతో పంట నష్టపోతున్న రైతులకు అటువంటి దుర్భర పరిస్థితులు రాకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే పరీక్షించే విధంగా వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్‌కు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు లభించేలా ఈ ల్యాబ్‌లు కీలక పాత్ర పోషించనున్నాయి.

ఒక ల్యాబ్‌కు రూ.55లక్షలు

వైఎస్సార్ అగ్రిటెస్టింగ్‌ల్యాబ్స్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా సుమారు రూ.55 లక్షలతో ఒక్కో భవన నిర్మాణం చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో జరుగుతున్న భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయని అధికారులు చెబుతున్నారు.

చేరుకుంటున్న పరికరాలు

అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌లో విత్తనాలు, ఎరువులు, భూసారం తదితర పరీక్షలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ పరీక్షలకు కావాల్సిన లక్షలాది రుపాయల విలువ చేసే పరికరాలను ప్రభుత్వం ఈ కేంద్రాలకు పంపిస్తోంది. మార్కెట్లోకి వచ్చే ప్రతి ఇన్‌పుట్ శాంపిల్‌ను రైతులు ఇక్కడ పరీక్షించుకునే వెసులుబాటు ఉండడం వల్ల నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద నుంచి రైతులకు ఉపశమనం కలగనుంది. రైతులు పండించిన పంటల నుంచి సొంతంగా తయారుచేసుకున్న లేదా మార్కెట్లో కొనుగోలు చేసుకున్న విత్తనాలను ఈ ల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనాలతో పాటు ఎరువులు, పురుగుల మందుల నాణ్యతను పరీక్షించుకోవచ్చు.

రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానం

రైతులకు అన్ని రకాల సేవలను గ్రామాల్లోనే అందిస్తున్న రైతుభరోసా కేంద్రాలను వైఎస్సార్ అగ్రిటెస్టింగ్‌ల్యాబ్స్‌కు అనుసంధానం చేయనున్నారు. ఈ పరీక్షలను ప్రత్యేక నిపుణులు చేస్తారు. అత్యాధునిక పరికరాల ద్వారా చేసే ఈ పరీక్షలు రైతులకు ఎంతో లాభసాటిగా మారనున్నాయి. వాటిపై రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించి, ఈ ల్యాబ్స్‌లో పరీక్షలు చేసుకునే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ల్యాబ్స్ ఉపయోగకరం

జిల్లాకు నాలుగు వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్ మంజూరయ్యాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నాణ్యతను రైతులు పరీక్షించుకోవచ్చు. ఇది వారికి ఎంతో ఉపయోగకరం. ముఖ్యంగా నకిలీ విత్తనాలు, ఎరువుల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుంది. త్వరలో ఇవి ప్రారంభమవుతాయి.

– రాబర్ట్‌పాల్,జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

కనులకు అందం.. కవలల బంధం

- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం


జయ.. విజయ


తన్మయి.. తనూజ


జయంత్.. జశ్వంత్

రాజాం/రాజాం సిటీ/రేగిడి/వంగర: అశ్విని దేవతలు, లవకుశలు, నకుల, సహదేవులు కవలలని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి. ఒకే రూపంతో ఉండే కవలలంటే ఇష్టపడని హృదయం ఉండదు. సహజత్వంతో ఉండే కవలల కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి 22న కవలల దినోత్సవం జరుపుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఈ కవలలు కలుసుకునే కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. గతంలో ఎక్కడో కనిపించే కవలలు నేడు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నారు. కవలల రూపం ఒకేలా ఉంటుంది కానీ, అభిరుచులు కొందరిలో ఒక్కొక్కరివి ఒక్కోలా ఉంటాయని, ఒక్కో జంటలో ఒకేలా ఉంటాయని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలోని కవలలకు శుభాకాంక్షలు తెలియజేద్దాం.


శివ, అయ్యప్పలు


రాము.. లక్ష్మణ


జాహ్నవి, జగపతి


చందన్.. చరణ్


సాయికార్తీక్, సాయిశ్రీ


హర్షిత్, హస్మిత్


దనుశ్రీ, ధనుష్

ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: ఈ నెల 26 నుంచి జరగనున్న ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ అన్నారు. ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలకు ఎగ్జామినర్‌లుగా వ్యవహరించే లెక్చరర్లకు మంగళవారం జరిగిన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష విధుల నిర్వహణ సమయంలో ప్రభుత్వ నింబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సంవత్సరం ఇంటర్‌మీడియట్ పరీక్షలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతాయన్నారు. ప్రతి కళాశాలలో ల్యాబ్‌లను పరిశీలించామని, అన్ని సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వృత్తివిద్యాధికారిణి మంజులవీణ, డీఈసీ సభ్యుడు జగన్నాథరావు, ఎస్. రామకృష్ణ, హైపవర్ కమిటీ సభ్యుడు వై.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ అకుల రాజు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇల్లు అద్దె కోసం వచ్చి.. చోరీ


బాధితురాలు కమల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పాలకొండ రూరల్: ఇల్లు అద్దెకు ఇస్తారా? అంటూ ఓ ఆగంతుకుడు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. నగర పంచాయతీలో మంగళవారం జరిగిన ఈ సంఘటన ఆందోళన కలిగించింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన మార్కెట్‌కు సమీపంలోగల ముదునూరివారి వీధిలో వైద్యుడు వడ్డే నవీన్ కుమార్ నివాసముంటున్నారు. ఇంట్లోని అందరూ పనులపై బయటకు వెళ్లగా ఆయన తల్లి కమల ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఇల్లు అద్దె కోసమని వచ్చి, తమవారు వస్తారని నమ్మబలికాడు. ఈ క్రమంలో తాగునీరు కావాలని ఆమెను అడగ్గా నీరు అందించేందుకు ఆమె ఇంట్లోకి వెళ్లగా వెంబడించి ఇంట్లోకి చొరబడ్డాడు. నువ్వు ఎందుకు లోపలకు వచ్చావని ఆమె ప్రశ్నించే యత్నం చేయగా అకస్మాత్తుగా ఆగంతుకుడు ఆమెను కిందకు నెట్టివేసి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని ఉడాయించాడు. ఈ ఘటన నుంచి తేరుకున్న బాధితురాలు జరిగిన విషయంపై తన కుమారులకు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ ఫుటేజ్ పరిశీలన

ఫిర్యాదు మేరకు ఎస్సై బి.శివప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళకు ధైర్యం చెప్పారు. ఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలపై దృష్టిపెట్టారు. క్లూస్‌టీమ్, ఇతర పోలీస్ బృందాలు ఘటనపై దర్యాప్తు చేపట్టాయి.

భూ వివాదాల శాశ్వత
పరిష్కారమే ధ్యేయం

- రీ సర్వే ఎ.డి త్రివిక్రమరావు


మాట్లాడుతున్న భూ సర్వే ఎ.డి త్రివిక్రమరావు

రామభద్రపురం: సుదీర్ఘ కాలంగా ఉన్న భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు భూరక్ష పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 179 గ్రామాలలో సర్వే పూర్తయిందని రీ సర్వే ఎ.డి టి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, రీ సర్వే డీటీ ఉమామహేశ్వరితో సమావేశమై మండలంలో జరుగుతున్న రీ సర్వేపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మొదట దశలో చేపట్టిన భూ రీస్వేలో 179 గ్రామాలలో పూర్తి చేయగా సుమారు 877 గ్రామాలలో డ్రోన్‌ఫ్లై, 350 గ్రామాలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశామన్నారు.ఈ సర్వేను 480 మంది మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, తదితర బృందంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల సమక్షంలో అధునాతన, సాంకేతిక, యంత్రాలతో డ్రోన్, ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ సర్వేలను అధికారులు చేపడుతున్నారన్నారు. ఇందులో వ్యవసాయ, ప్రభుత్వ పట్టాభూములు, ఇంటి స్థలాలతో పాటు నివాస గృహాలు సైతం సర్వే చేస్తారని తెలిపారు. సర్వే చేసిన వివరాలన్నీ డిజిటలైజ్ చేయడంతో ప్రపంచంలో ఎక్కడినుంచైనా వారి భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు చౌదరి, మండల సర్వేయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

26, 27న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

- జెడ్పీ చైర్మన్ సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ
- ప్రథమ బహుమతి రూ.30 వేలు


వాలీబాల్ కోర్టు కోసం స్థల పరిశీలన చేస్తున్న నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

చీపురుపల్లి: పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర జరగనున్న నేపథ్యంలో ఈ నెల 26, 27న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. అమ్మవారి ఆలయ సమీపంలో వాలీబాల్ కోర్టుల కోసం మంగళవారం వారు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26న సాయంత్రం 5 గంటలకు టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానం రూ.15 వేలు, అయిదో స్థానం రూ.10 వేలు, ఆరో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్ నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు భరించనున్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న అమ్మవారి జాతర, క్రీడా పోటీలను ప్రజలు, భక్తులు విజయవంతం చేయాలని కోరారు.వ్యాయామ ఉపాధ్యాయులు పి.సి.స్వరూప్, కె.మురళీధర్, అప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్‌చైర్మన్ సూరు కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళగిరి శ్రీను, దాలయ్య, ప్రభాత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు అండగా బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనారిటీలు


మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యురాలు ఎస్.జయమణి

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కోసం సేవలందించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి అన్నారు. ఈ మేరకు మంగళవారం పెదభోగిలి గ్రామంలోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కోసం తాను అందించిన సేవలను గుర్తించి తనను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలిగా నియమించారన్నారు. అలాగే శాసన మండలిలో ఖాళీఅయిన ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే సందర్భంలో జగనన్న ప్రభుత్వానికి, పార్టీకీ విధేయులుగా ఉంటూ సేవలందిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కులాల వారిని ఎమ్మెల్సీలుగా ప్రకటించడం అభినందనీయమన్నారు. ముందున్న చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి పదవులు దక్కకుండా చేసినప్పటికీ జగనన్న ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ వర్గాల వారికి అందలం ఎక్కించడంతో తామంతా జగనన్నకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు రామారావు, మాజీ ఎంపీటీసీ మాధవరావు పాల్గొన్నారు.

మార్చి 7 వరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు పునశ్చరణ తరగతులు


పునశ్చరణ తరగతుల్లో భాగంగా వివిధ అంశాలపై వివరిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రతి ఏటా నిర్వహించే పునశ్చరణ తరగతులను మార్చి 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. ఈ మేరకు పునశ్చరణ తరగతులను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు విధులను నిర్వహించినప్పుడు నిష్పక్షపాతంగా అంకితభావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువకావాలని సూచించారు. విధుల్లో నైపుణ్యం సాధించేందుకు ప్రతి ఏడాది నిర్వహించే తరగతులను సద్వినియోగం చేసుకుని, శారీరక దారుఢ్యాన్ని కాపాడుకుంటూ, ఆయుధాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు.

పునరంకితం కావాలి

అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్ మాట్లాడుతూ యూనిఫాం ధరించిన తర్వాత ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణకే పోలీసులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. 15 రోజుల పాటు సాగే ఈ తరగతులతో వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఆర్మ్‌డ్ పోలీసులకు వ్యక్తిత్వ వికాసాన్ని, ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు ప్రణాళికాయుతంగా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వాటితో పాటు శారీరక దారుఢ్యం పెంచేందుకు, వివిధ ఆయుధాల ఉపయోగాలను, ముఖ్యమైన బందోబస్తు విధులను ఏ విధంగా నిర్వహించాలో, ఫైరింగ్ ప్రాక్టీస్, బాంబ్ స్క్వాడ్ పనితీరు ఏ విధంగా చేపట్టాలో, మస్కట్రీ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

సారా రవాణాపై దాడులు

పార్వతీపురం: ఒడిశా నుంచి పార్వతీపురం మున్సిపాల్టీ కొత్తవలసకు సారా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో పార్వతీపురం మున్సిపాల్టీ సూర్యపీఠం సమీపంలో గల పొలాల్లో కాపుకాసి 800లీటర్ల సారాను సీజ్ చేసి జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎల్.ఉపేంద్ర మంగళవారం తెలిపారు. ఒడిశాలోని మెల్లక ముత్యాలు వద్ద సారాను కొనుగోలు చేసి పార్వతీపురం, వీరఘట్టం ప్రాంతాల్లోని ఐదుగురికి సరఫరా చేసేందుకు కూలీల ద్వారా కాలినడకన తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ మేరకు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అరెస్టు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204